సాక్షి
పెద్దపల్లి
బుధవారం ı 4 ı జనవరి ı 2023



గోదాంలో గోల్‌మాల్..!

పెద్దపల్లి పౌరసరఫరాల గోదాం నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా చేసే బియ్యం నిల్వల్లో గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది. 8లో



పత్తి క్వింటాల్‌కు రూ.8,214

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తికి గరిష్టంగా రూ.8,214 పలికింది. కనిష్టంగా రూ.7,751, సరాసరిగా రూ.8,114గా నిర్ధారించినట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
31.0 /19.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటిపూట ఎండగా ఉంటుంది. ఉక్కపోత పెరిగే అవకాశముంది. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

రామగుండం సీపీ బదిలీ



ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి

గోదావరిఖని: రామగుండం సీపీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి బదిలీ అయ్యారు. 2021 ఆగస్టు 09న సంగారెడ్డి ఎస్పీ నుంచి ఇక్కడకు సీపీగా బదిలీపై వచ్చారు. కాళేశ్వరం జోనల్ ఇన్‌చార్జిగా కొనసాగారు. అదే సమయంలో ఐజీగాను పదోన్నతి లభించినప్పటికీ ఇక్కడే సీపీగా పనిచేశారు. సుమారు 18 నెలల పాటు ఆయన ఇక్కడ సీపీగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయనను మల్టీజోనల్–1కు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నేటి నుంచి బీహార్‌కు ప్రత్యేక రైళ్లు



ప్రత్యేక రైలు

రామగుండం: సికింద్రాబాద్ – పాట్నా (రైలు నంబర్ 03253), హైదరాబాద్–పాట్నా (రైలు నంబర్ 07255), పాట్నా–హైదరాబాద్ (రైలు నంబర్ 07256) ప్రత్యేక రైళ్లను నెలరోజుల పాటు మూడు రైళ్లను నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. రైలు నంబర్ 03253, సికింద్రాబాద్–పాట్నా ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతి సోమ, బుధ వారాల్లో నడవనుంది. హైదరాబాద్–పాట్నా (రైలు నంబర్ 07255) రైలు ప్రతి బుధవారం నడుస్తుండగా.. ఈనెల 4, 11, 18, 25, ఫిబ్రవరి ఒకటిన నడవనుంది. పాట్నా–హైదరాబాద్ (రైలు నంబర్ 07256) ప్రతి శుక్రవారం నడుస్తుండగా.. ఈనెల 6, 13, 20, 27 తేదీల్లో రాకపోకలు సాగించనుంది. రైళ్లకు సికింద్రాబాద్, కాజీపేట, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్‌నగర్, బల్హార్షా, నాగపూర్, గోండియా, దుర్గ్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్, జార్సుగూడ, రూర్కెల, హతియా, రాంచీ, బోకారో స్టీల్ సిటీ, గోమో, కొడెర్మా, గయా, జెహనాబాద్ తదితర స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

ఆయిల్ పాం తోటలను సందర్శించిన డీఏవో



పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారులు

ధర్మారం: మండలంలోని బొట్లవనపర్తి గ్రామంలో సాగు చేస్తున్న ఆయిల్ పాం తోటలను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, సహాయ సంచాలకులు శ్రీనాథ్ సందర్శించారు. రైతులకు తగిన సలహాలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి ఆదిరెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పాం తోటలతో రైతులకు అధిక లాభాలు వస్తాయన్నారు. ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తోందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పూర్ణిమ, ఏఈవోలు రాహుల్, ప్రశాంత్, సతీశ్, రైతులు పాల్గొన్నారు.

ప్ర'యోగం' లేని చదువులు..!



జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో అధ్వానంగా ల్యాబ్ పరిస్థితి



గోదావరిఖనిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బీరువాలో పరికరాలు..

- కళాశాలల్లో అలంకారప్రాయంగా ప్రయోగశాలలు
- నిధులు లేక.. కొత్త పరికరాలు కొనలేక..
- ఇంటర్ విద్యార్థుల్లో కొరవడుతున్న 'శాస్త్ర' పరిజ్ఞానం
- నామమాత్రపు తరగతులతో ఫలితం శూన్యం

సాక్షి, పెద్దపల్లి: 'విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలకు బీజం పడితే ఆవిష్కరణల బలం పెరుగుతుంది. దేశం భద్రంగా ఉంటుంది. ప్రయోగాల విజ్ఞానాన్ని ఆవిష్కరణలుగా అంకురకేంద్రాలుగా, పరిశ్రమలుగా మలచాలి. అప్పుడే సమ్మిళిత సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుంది..' ఇదీ తరచూ శాస్త్రవేత్తలు చెప్పేమాటలు. అయితే వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న అనేక సమస్యలు విద్యార్థులను ఆ దిశగా నడిపించటం లేదు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు వారికి పాఠ్యాంశాలు బాగా గుర్తుండేలా ప్రయోగాలు చేయాలని నిబంధనలు ఉన్నా.. నిధులు లేకపోవడం.. పాత పరికరాలు బీరువాలకే పరిమితం కావడంతో విద్యార్థులు పుస్తకాలకే పరిమితం కావాల్సిన దుస్థితి నెలకొంది. మూడేళ్లుగా ప్రభుత్వం నయాపైసా విడుదల చేయకపోవడంతో పరికరాలు లేక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రయోగాలు అటకెక్కాయి.

ప్రాక్టికల్సే కీలకం..

జిల్లాలో 54 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో ఫస్టియర్ 5,894 మంది, సెకండ్ ఇయర్‌లో 6,171 మంది చదువుతున్నారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ అంటేనే ప్రయోగాల కోర్సులు. రెండేళ్ల చదువు పూర్తి చేసేలోపు భౌతిక, రసాయన, జంతు, వృక్ష శాస్త్రాలకు సంబంధించిన ప్రయోగాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రయోగశాలకు వెళ్లి నేర్చుకోవాల్సి ఉంటుంది. పలువురు విద్యార్థులకు పిప్పెట్, బ్యూరెట్, ఘటం, ఆమ్లం, క్షారం, లవణం, వెర్నియర్‌కాలిపస్, స్క్రూగేజీ, లఘులోలకం, అయస్కాంతం రకాలు, విద్యుత్ ప్రవాహం అంటే తెలియని పరిస్థితి ఉందంటే అతిశయోక్తికాదు. అదేవిధంగా ఏకదళ బీజం, ద్విదళ బీజం, కేసరాలు, అండాశయం, అంతర్ నిర్మాణాల గురించి అస్సలు తెలియని వారు కూడా ఉన్నారు. జువాలజీకి సంబంధించి డిటిక్షన్ అంటే తెలియదు. స్పెసిమెన్, స్లైడ్స్ గురించి అవగాహన లేనివారు ఉన్నట్లు పలువురు అధ్యాపకులే చెబుతుండడం విశేషం. ఫలితంగా ప్రైవేట్ కళాశాలతో పోల్చుకుంటే మెరుగ్గా రాణించలేకపోతున్నారు. ఫలితంగా ఉత్తీర్ణత శాతం సైతం తగ్గుతుంది.

నిధులు విడుదల కాలేదు



జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో అన్నింటిలో ప్రయోగాలలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. వసతులు, ఆధునికీకరణ అంశాలను నివేదించాం. గతంలో ఉన్న ప్రయోగపరికరాలతో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటాం. ఈయేడు నిధులు విడుదల కాకపోవడంతో నూతన పరికరాలు, రసాయనాలు కొనుగోలు చేయలేదు.

– కల్పన, ఇంటర్ జిల్లా నోడల్ అధికారి

నేరాల నియంత్రణకు కృషి చేస్తాం

'సాక్షి'తో పెద్దపల్లి డీసీపీ రూపేశ్



- ఆఫీస్ సెల్ నంబర్ 87126 56585
- ఫోన్‌లో సమాచారమిచ్చినా స్పందిస్తాం
- ఇటుక బట్టీల్లో చిన్నారులకు విద్యకోసమే 'ధృవ'
- ఉద్యోగాల పేరిట వసూళ్లకు పాల్పడితే కఠినచర్యలు
- మహిళలను వేధించే ఆకతాయిలకు చుక్కలే

పెద్దపల్లిరూరల్: 'నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరం.. మా ఆఫీసు ఫోన్ నంబర్ 87126 56585. ఫోన్‌లో సమాచారమిచ్చినా స్పందిస్తా.. నిత్యం ఆఫీసులోనే అందుబాటులో ఉంటా.. అసాంఘిక కార్యకలాపాలు, మోసాలకు పాల్పడే వారిపై ఫిర్యాదు చేసేందుకు నిర్భయంగా రావొచ్చు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వసూళ్లకు పాల్పడే వారిపై ఫిర్యాదు అందితే కఠినంగా వ్యవహరిస్తాం. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం.. సైబర్‌క్రైం నేరాల నియంత్రణకు అనుసరించాల్సిన పద్ధతులపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరముంది..' అని అన్నారు పెద్దపల్లి డీసీపీ రూపేశ్. ట్రాఫిక్ సమస్యలు తదితర అంశాలపై ఆయన మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు.

సాక్షి: గంజాయి రవాణా నియంత్రణ..?

డీసీపీ: యువతే లక్ష్యంగా గతంలో కొందరు గంజాయిని అక్రమంగా రవాణా చేసేవారు. వారిని పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేసిన ఘటనలున్నాయి. గంజాయికి అలవాటుపడినవారు అవసరం మేరకే తెచ్చుకుంటున్నట్లు గుర్తించాం. అయితే గంజాయిని ఎక్కడి నుంచి తెస్తున్నారని తెలుసుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం.

సాక్షి: సైబర్ నేరగాళ్ల మోసాలపై..?

డీసీపీ: డిజిటల్ పేమెంట్ విధానంపై ఖాతాదారులు అవగాహన పెంచుకోవాలి. ఇందుకోసం పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ మోసానికి గురయ్యామని తెలిసిన వెంటనే పోలీసులు, బ్యాంకు అధికారులకు సమాచారమందించాలి. సైబర్ మోసాలను నియంత్రించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రానుంది. దాంతో ఖాతాదారులకు మరింత భద్రత కలగనుంది.

సాక్షి: భూసంబంధ సమస్యలపై ఫిర్యాదులున్నాయా..?

డీసీపీ: నేను బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఫిర్యాదులేవీ రాలేదు.

సాక్షి: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసగించిన వారిపై చర్యలేంటి..?

డీసీపీ: నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్నారు. వారి బలహీనతను ఆసరాగా తీసుకుని కొందరు రూ.లక్షల్లో వసూలు చేసినట్లు ఆర్‌ఎఫ్‌సీఎల్ వ్యవహారంలో చూశాం. ఇలాంటివే జిల్లాలో అక్కడక్కడా ఉండొచ్చు. ఉద్యోగాలిప్పిస్తామని ఆశ చూపి డబ్బులు తీసుకున్న వారిపై ఫిర్యాదు అందితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాం.

సాక్షి: ఇటుకబట్టీల్లో 'ధృవ' పాఠశాలలు ఏర్పాటుపై..?

డీసీపీ: ఒడిశా నుంచి వచ్చి ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న వారి పిల్లలకు మాతృభాష ఒడిశాలోనే చదువు చెప్పించేందుకు 'ధృవ' డిజిటల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని బట్టీల యజమానులకు సూచించాం. వారంతా సానుకూలంగా స్పందించారు. ఇప్పుడిప్పుడే పాఠశాలల ఏర్పాటు మొదలైంది. అన్ని బట్టీల్లో ఏర్పాటు చేయిస్తాం. అయితే నిర్వహణ బాధ్యతల కోసం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

సాక్షి: ఫైనాన్స్ దందా, వడ్డీవ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు..?

డీసీపీ: ప్రజలు రిజర్వు బ్యాంకు అనుమతితో ఏర్పాటైన జాతీయబ్యాంకుల్లోనే డబ్బు దాచుకోవాలి. కొత్తగా పుట్టుకొస్తున్న వాటిలో సొమ్ము డిపాజిట్ చేసి మోసపోవద్దు. చిరు వ్యాపారులు, ప్రజల అవసరాల కోసం అధికవడ్డీలకు ఇచ్చే గుర్తింపు లేని ఫైనాన్స్ నిర్వాహకుల వివరాలను సేకరిస్తున్నాం. అక్రమదందాకు పాల్పడుతున్నవారిపై చర్యలుంటాయి.

సాక్షి: మహిళలను వేధిస్తున్న ఆకతాయిలపై..?

డీసీపీ: మహిళా సంరక్షణ కోసం అనేక చట్టాలున్నాయి. ఇందుకోసం పోలీసు శాఖ ప్రత్యేక యాప్‌లను అందుబాటులో ఉంచింది. మహిళలు నిర్భయంగా పోలీసులకు సమాచారం అందిస్తే సత్వర చర్యలుంటాయి.

సాక్షి: నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డీసీపీ: వాస్తవానికి గతంలో కంటే నేరాలు గణనీయంగా తగ్గాయి. అప్పుడప్పుడు జరిగే నేరాల్లో నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాల ఏర్పాటుకూ ప్రాధాన్యతనిస్తున్నాం. సింగరేణి సంస్థ సహకారంతో రూ.10లక్షలతో, పెద్దపల్లి, మంథనిలో కలెక్టర్ ఇచ్చిన రూ.8లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.

సాక్షి: ఇసుక దందాలపై చర్యలేవీ..?

డీసీపీ: ఇసుక వ్యవహారం మా పరిధి కాదు. సంబంధిత శాఖల అధికారులకే చర్యలు తీసుకునే అవకాశముంటుంది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరిస్తాం.

'పది' ఫలితాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లాను ముందువరుసలో ఉంచేలా ఉపాధ్యాయులు బోధించాలని, ఇందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యాధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఏప్రిల్ 3నుంచి జరిగే పరీక్షల్లో ఆరుపేపర్లు ఉంటాయని, అందుకనుగుణంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు అల్పాహారం అందించేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. డీఈఓ మాధవి, ఎంఈఓలు పాల్గొన్నారు.

18 నుంచి మలివిడత 'కంటివెలుగు'

ఈనెల 18 నుంచి మలివిడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖమంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. మంత్రులు దయాకర్‌రావు, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, సీఎస్ సోమేశ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పరీక్షలు నిర్వహించే వైద్య బృందానికి రోజుకు రూ.1500 భోజనం కోసం అందిస్తారన్నారు. శిబిరాల నిర్వహణకు రోజుకు రూ.వెయ్యి చొప్పున ముందుగానే విడుదల చేస్తామన్నారు. కలెక్టర్ సంగీత, ఎంపీ వెంకటేశ్‌నేత, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, రామగుండం కార్పొరేషన్ మేయర్ అనిల్‌కుమార్, మున్సిపల్ చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలను సందర్శించిన డీఎంఈ

కోల్‌సిటీ(రామగుండం): రామగుండంలోని వైద్య కళాశాలను రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు(డీఎంఈ) రమేశ్ రెడ్డి మంగళవారం ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ గణపతిరెడ్డితో కలిసి సందర్శించారు. మెడికల్ కాలేజీ ఆవరణ, తరగతి గదులు, ల్యాబ్‌లు, కార్యాలయంతోపాటు హాస్టళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారిలోని మేజర్ నాలాకు మరమ్మతు చేపట్టాలని ఇంజినీర్ అధికారులకు సూచించారు. తరుచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని, ఈ క్రమంలో కళాశాలకు నేరుగా విద్యుత్ సరఫరా అయ్యేలా చొరవ తీసుకోవాలని డీఎంఈని ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్ కోరగా.. కలెక్టర్‌కు లేఖ రాయాలని సూచించారు. కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ నరేందర్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ చందర్‌సింగ్, ఈఈ నరసింహాచారి, డీఈఈ జావెద్, ఏఈ జావిద్, ఆర్కిటెక్ రాజ్‌కుమార్, ప్రాజెక్ట్ మేనేజర్ సంపూర్ణరావు, మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

11వ వేతన ఒప్పందం ఖరారు



సమావేశంలో జాతీయ సంఘాల నాయకులు

గోదావరిఖని: బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పంద చర్చలు సఫలమయ్యాయి. మంగళవారం కోలిండియా యాజమాన్యంతో జాతీయకార్మిక సంఘాలైన ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, బీఎంఎస్, సీఐటీయూ నేతలు కోల్‌కత్తాలో సమావేశమయ్యారు. ఈ చర్చల్లో 19శాతం కనీస వేతనం పెంచేందుకు కోలిండియా యాజమాన్యం అంగీకరించినట్లు జాతీయ కార్మిక సంఘాలు తెలిపాయి. కార్మిక సంఘాలు 25శాతం పెరుగుదల ఉండాలని డిమాండ్ చేయగా.. కోలిండియా యాజమాన్యం 15 నుంచి 19శాతం వరకు పెంచేందుకు అంగీకరించింది. 19శాతం పెరుగుదలతో 2021 నాటి కనీస వేతనాలపై 19శాతం పెరుగుదల ఉండనుంది. ఈ లెక్కన జూన్ 2021న ఒక్కో మస్టర్‌కు రూ.1441.49 చొప్పున 26 మస్టర్లకు లెక్కిస్తే 36,703.94 కానుంది. దీనిపై 19శాతం లెక్కన రూ.43,677.67 పెరగనుంది. గత వేతన ఒప్పందంతో పోల్చితే కనీస వేతన ఒప్పందం 14,283.44 పెరిగినట్లు సీఐటీయూ వేజ్‌బోర్డు సభ్యులు మంద నర్సింహారావు 'సాక్షి'కి తెలిపారు. చర్చల్లో వేజ్‌బోర్డు సభ్యులు సీతారామయ్య, రియాజ్‌అహ్మద్, మాధవనాయక్ పాల్గొన్నారు. 10వ వేతన ఒప్పందంలో 20శాతం పెరుగుదలతో రూ.4,800 పెరగగా, ఈసారి 19శాతంతో బేసిక్‌పై 6,973.73 పెరగనుందని వెల్లడించారు.

'సహకార' ఉద్యోగులకు తీపి కబురు

- సీఈఓ, సిబ్బంది, చైర్మన్లకు జీతాలు పెంపు
- జిల్లాలో 20 పీఏసీఎస్‌లు
- 130 నుంచి150 మంది ఉద్యోగులకు ప్రయోజనం



సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం

సుల్తానాబాద్: సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, చైర్మన్లకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. దినదినాభివృద్ధి చెందుతూ.. రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్న సహకార సంఘాల సంఘాల్లో పనిచేస్తున్న సీఈఓలు, క్లర్కు, సేల్స్‌మన్, అటెండర్, స్వీపర్, కంప్యూటర్ ఆపరేటర్, బ్యాంకు సిబ్బందికి వేతనాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2009 నుంచి 2019 మార్చి 31వరకు నియమితులైన వారికి జీవో నంబర్ 44 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో సిబ్బందిలో సంతోషం వ్యక్తమవుతోంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని 14 మండలాల్లో 20 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 300మందికి పైగా పనిచేస్తున్నారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. వీరిలో 130 నుంచి 150 మంది వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. వీరంతా ఇప్పటివరకు నామమాత్రపు వేతనం పొందుతున్నారు. వీరికి జిల్లా సహకార అధికారి నుంచి ఎలాంటి అనుమతులూ లేవు. పాత జీవోను చూపిస్తూ సంఘాలకు వచ్చే ఆదాయం నుంచే వేతనాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ తాజా జీవోతో ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనం కంటే అదనంగా రూ.5వేల నుంచి రూ.15 వేల వరకు పెరిగే అవకాశం ఉంది.

ప్రత్యేక బోర్డు ద్వారా నియామకం

సిబ్బందిని ఇప్పటివరకు ఏ పాలకవర్గం ఉంటే వారు తమ అనునయులను తాత్కాలికంగా నియమించుకునేవారు. ఇప్పుడు పనిచేస్తున్న 90 శాతం మంది ఇలాగే విధుల్లో కొనసాగుతున్నారు. ఆ ఆనవాయితీకి చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తెస్తోంది. పాలకవర్గంతో ప్రమేయం లేకుండా ప్రత్యేక బోర్డు ద్వారా మాత్రమే సిబ్బందిని నియమించనున్నారు. చదువు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటారు.

పాత పద్ధతిలోనే కార్యదర్శులు

సహకార సంఘాల్లో కార్యనిర్వాహక బాధ్యతలు చూసేవారిని ఇప్పటివరకు పీఏసీఎస్ సీఈవోగా పరిగణిస్తున్నారు. కొత్త మార్గదర్శకాలతో మళ్లీ పాత పద్ధతినే సంఘం కార్యదర్శిగా హోదా నిర్ణయించారు. వీరిని డీసీసీబీల్లో నియమించుకునేందుకు రెండు శాతం రిజర్వేషన్ అమలు చేయనున్నారు. అన్ని అర్హతలున్న వారిని మాత్రమే ప్రత్యేకంగా ఏర్పాటయ్యే బోర్డు ద్వారా నియమించుకునే అవకాశం కల్పిస్తారు. వీరికి మెయింటనెన్స్ గ్రాట్యుటీ రూ.లక్ష నుంచి రూ.2.50 లక్షలకు పెంచారు.

పెరిగిన చైర్మన్ గౌరవ వేతనం

సహకార సంఘాల చైర్మన్లకు గౌరవ వేతనం పెంచేందుకు సర్కారు పచ్చజెండా ఊపింది. ఆయా సంఘాల వ్యాపార, ఆర్థిక లావాదేవీలను బట్టి ఇప్పటివరకు గౌరవ వేతనం తీసుకుంటున్నారు. 2006 నుంచి ఈ పద్ధతి అమలవుతోంది. అది కూడా రూ.300 నుంచి రూ.1,250 వరకు మాత్రమే తీసుకునే వెసులుబాటు ఉంది. ఇక మీదట దీన్ని రూ.5వేల నుంచి రూ.15వేల వరకు తీసుకునే అవకాశం కల్పించారు.

చైర్మన్ల ఆత్మగౌరవాన్ని పెంచింది



రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చైర్మన్ల ఆత్మగౌరవం పెరుగుతుంది. రైతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. దీనికి నిదర్శనమే గౌరవవేతనం పెంచడం.

– శ్రీగిరి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్, సుల్తానాబాద్

సంఘం బలోపేతమే లక్ష్యం



సహకార సంఘాలను బలోపేతం చేసేందుకే ప్రభుత్వం ఉద్యోగుల క్రమబద్ధీకరణకు నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల వివరాలను సంఘాల కార్యదర్శులను నుంచి నివేదిక కోరాం. వారివారి శాఖల్లో 2004 నుంచి 2019 వరకు విధుల్లో చేరిన వారి వివరాలు సేకరిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 130 నుంచి 150 వరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. – మైఖేల్ బోస్, జిల్లా సహకార అధికారి

రికవరీలోనూ ముందున్నాం



రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు ఇస్తూ.. రికవరీ కూడా అలాగే చేస్తున్నాం. సంఘాలు వాణిజ్య బ్యాంకులకు దీటుగా పనిచేస్తున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగుల భద్రతకు హామీ ఇచ్చినట్లయ్యింది. ప్రభుత్వ రుణం తీర్చుకోలేం.

– శంకర్ గౌడ్, సీఈఓల సంఘం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

శ్రీకృష్ణకు డాక్టరేట్



డాక్టరేట్ సాధించిన శ్రీకృష్ణను సన్మానిస్తున్న ప్రతినిధులు

రామగుండం: పెద్దపల్లి సెక్షన్‌లో రైల్వే ట్రాక్‌మెన్ (ఇంజినీరింగ్ విభాగం)గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీకృష్ణ అనే కార్మికుడికి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. మంగళవారం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ రామగుండం బ్రాంచ్ కార్యాలయంలో అయనను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో సంఘ్ బ్రాంచ్ చైర్మన్ సంపత్‌కుమార్, కార్యదర్శి అజ్మీరా వీరన్ననాయక్, ప్రతినిధులు కలవేడి అనిల్‌కుమార్, విజయ్‌కుమార్, రాజ్‌కుమార్, రమణాచారి, సదానందం, చందర్, మురళీమోహన్ తదితరులున్నారు.

నేడు ముప్పిరితోట జీపీ మామిడితోట వేలం

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట గ్రామ పంచాయతీకి చెందిన సర్వే నంబర్ 295 లోని 22ఎకరాల మామిడితోటను ఈనెల 4న వేలం వేయనున్నట్లు సర్పంచ్ పెద్దొళ్ల ఐలయ్య, పంచాయతీ కార్యదర్శి తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.20వేలు పంచాయతీ కార్యదర్శి, ముప్పిరితోట పేరిట ధరావత్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలంలో తోటను గెల్చుకున్న వారు ఏడు రోజుల్లో నగదు పూర్తిగా చెల్లించాలన్నారు.

క్రీడలతో స్నేహభావం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీసీపీ రూపేశ్

రామగిరి(మంథని): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని పెద్దపల్లి డీసీపీ రూపేశ్ తెలిపారు. స్థానిక జేఎన్టీయూ మైదానంలో పెద్దపల్లి పోలీస్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను మంగళవారం ప్రారంభించారు. పెద్దపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని 6 పోలీస్ సర్కిళ్లలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిత్యం పనిఒత్తిడితో బిజీగా ఉండే పోలీసులకు ఇలాంటి పోటీలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. గోదావరిఖని, పెద్దపల్లి ఏసీపీలు గిరిప్రసాద్, సారంగపాణి, ఎస్‌బీ ఏసీపీ మోహన్, సీఐలు సతీశ్ కుమార్, ప్రదీప్ కుమార్, ఇంద్రసేనారెడ్డి, వేణుగోపాల్, రమేశ్‌బాబు, చంద్రశేఖర్, రామగిరి, మంథని, కమాన్‌పూర్, సుల్తానాబాద్, పొత్కపల్లి ఎస్సైలు రవిప్రసాద్, వెంకటేశ్వర్లు, ఉపేందర్ రావు, మహేందర్ పాల్గొన్నారు.

ఒకరి బలవన్మరణం



ప్రభాకర్ (ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): అనారోగ్య కారణాలతో ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నపూర్ణ కాలనీకి చెందిన మెండె ప్రభాకర్(45) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు ప్రకారం.. ప్రభాకర్ పదేళ్లుగా రామగుండం సీఆర్పీగా పని చేస్తున్నాడు. ఇదివరకే అతనికి ఒక కన్ను లేకపోగా, ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ఆయన మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని,దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై చక్రపాణి తెలిపారు.

సివిల్ సప్లయ్ గోదాంలో గోల్‌మాల్..!

- 600 క్వింటాళ్ల బియ్యం మాయం..?
- నేడు గోదాంలో మళ్లీ విచారణ



గోదాములో నిల్వలను పరిశీలిస్తున్న అధికారి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పౌరసరఫరాల గోదాం నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా చేసే బియ్యం నిల్వల్లో గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు 600 క్వింటాళ్లకు పైగానే నిల్వలో తేడా ఉన్నట్లు సమాచారం. గోదాం అధికారి అమృత్ కుమార్ విధుల్లో నిర్లక్ష్యం చేయడంతోపాటు అవకతవకలకు పాల్పడుతున్నాడంటూ రామగుండం మండల రేషన్ డీలర్లు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో గతనెల 12న సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈనెల రేషన్ కోటా బియ్యాన్ని డీలర్లకు పంపించేందుకు డిప్యూటీ తహసీల్దార్ తిరుపతిని ఇన్‌చార్జిగా నియమించారు. గోదాముల్లో రికార్డుల ప్రకారం నిల్వలు లేవని ఆయన బాధ్యతలను తీసుకునేందుకు నిరాకరించినట్లు సమాచారం.

సస్పెండ్ అయిన అధికారిపై ఆరోపణలు

సస్పెండైన పెద్దపల్లి సివిల్ సప్లయి గోదాం అధికారిపై అనేక ఆరోపణలు వినవస్తున్నాయి. రామగుండం మండలానికి చెందిన డీలర్లు గతంలో ఓ అధికారికి అక్రమాలపై సమాచారమిచ్చినా.. స్పందించ లేదని గోదావరిఖనికి చెందిన ఓ డీలర్ తెలిపారు. సదరు గోదాం అధికారికి సంబంధించిన పూర్తి ఆధారాలు, వీడియోలను ఉన్నతాధికారికి అప్పగించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

పైసలిస్తే సన్నబియ్యం

గోదాములో ఉన్న సన్నబియ్యాన్ని పైసలిచ్చిన డీలర్లకు పంపిస్తున్నాడని, ఇందుకు డీలర్లు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా ఆయన కుటుంబ సభ్యుల ఖాతాలో జమ చేశారని కొందరు డీలర్లు తెలిపారు. అంతేకాకుండా గోదాముల్లోనే విందులు చేసుకుంటున్న ఆధారాలను కూడా ఉన్నతాధికారికి నివేదించినట్లు సమాచారం.

తేడాలుంటే చర్యలు

సివిల్ సప్లయి గోదాములో బియ్యం నిలవలను లెక్కించాల్సి ఉంది. లెక్కింపు పూర్తి చేసిన అధికారి ఇచ్చిన నివేదిక ప్రకారం తేడాలుంటే అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
– వెంకటేశ్, డీఎస్‌ఓ, పెద్దపల్లి

నేడు విచారణ..

పెద్దపల్లి గోదాం ఇన్‌చార్జిగా తిరుపతికి బాధ్యతలను అప్పగించే సమయంలో గోదాములో నిలవలను లెక్కించేందుకు వచ్చిన అధికారి నర్సింహరెడ్డి పూర్తిస్థాయిలో విచారించకుండానే వెనుదిరిగినట్లు తెలిసింది. గోదాములో పెద్ద మొత్తంలో నిల్వలో తేడాలుండడంతో నిరాకరించినట్లు చెప్పుకుంటున్నారు. కాగా గోదాములో నిలవలను లెక్కించలేదని, బుధవారం లెక్కించి ఉన్నతాధికారులకు నివేదిస్తానని నర్సింహారెడ్డి తెలిపారు.

వేతన ఒప్పందాలు వర్తింపచేయాలి

రామగిరి(మంథని): కాంట్రాక్ట్ కార్మికులకు వేతన ఒప్పందాలు వర్తింపచేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న అన్నారు. ఐఎఫ్టీయూ ఇచ్చిన పిలుపు మేరకు సింగరేణి వ్యాప్తంగా రెండోరోజు కాంట్రాక్ట్ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సెంటినరీకాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు బుధవారం జరిగే జేబీసీసీఐ చర్చల్లో వేతనాలు నిర్ణయించేలా ఒప్పందం చేయాలని కోరారు. చాలీచాలని వేతనాలతో కాలం వెలదీస్తున్నారని, వారికి ప్రత్యేక వేతన ఒప్పందాన్ని వర్తింపచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు సంపత్, రాజేశం, రమేష్, కుమార్, లింగయ్య, ఓదెలు, కే.సది, వి.సంతు, సది తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు ఎలా ఉన్నాయి..?!



సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి



ఆసుపత్రి ముందు పచ్చదనం, పరిశుభ్రత

- రేపు సుల్తానాబాద్ ఆసుపత్రికి కాయకల్ప బృందం
- గతంలో అవార్డు అందుకున్న వైద్య విధాన పరిషత్
- మరోసారి కైవసం చేసుకునేందుకు సిద్ధమైన వైనం

సుల్తానాబాద్: గ్రామీణ ప్రాంతాలను ఆనుకుని ఉన్న సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందుతున్నాయా..? శుభ్రత, పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న సేవలు.., రోగులతో వ్యవహరిస్తున్న తీరు, శానిటేషన్, బయో మెడిసిన్ నిర్వహణ, స్టెరిలైజేషన్, రికార్డుల నిర్వహణతోపాటు 350 పాయింట్లపై తెలుసుకునేందుకు కాయకల్ప సర్వే బృందం గురువారం రానుంది. దీంతో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఇప్పటికే ఆసుపత్రిలో ఉన్న పలు రకాల రికార్డులను ఆధునీకరించడంతోపాటు పరిసరాలను శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

బహుమతి వస్తే..

సుల్తానాబాద్‌లోని వైద్య విధాన పరిషత్‌కు అవార్డు వస్తే భారీగా నిధులు సమకూరనున్నాయి. అవార్డులను మూడు కేటగిరీలుగా ప్రకటించినట్లు ఎస్‌హెచ్ఎం క్వాలిటీ ఇన్‌చార్జి అనిల్ తెలిపారు. మొదటి కేటగిరీలో రూ.20లక్షలు, రెండో కేటగిరీలో రూ.10లక్షలు, మూడో కేటగిరీలో రూ.లక్ష చొప్పున అందనున్నాయి. అయితే గతంలో సుల్తానాబాద్ ఆసుపత్రి రూ.లక్ష విభాగంలో అవార్డు గెలుచుకుంది. ఈసారి మరింత మెరుగుపడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. సిబ్బంది, డాక్టర్ల పనితీరు మెరుగుపడింది. వారి వైద్య సేవలు విస్తృతం కావడంతో ఈ సారి రూ.20 లక్షలు గెలిచే అవకాశముందని వైద్యులు భావిస్తున్నారు.

ఈనెల 5న బృందం రాక

కాయకల్ప బృందంలో సభ్యులుగా డాక్టర్లు తిరుపతి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సంధ్య ఉన్నారు. వీరు సుల్తానాబాద్‌ను ఆసుపత్రిని ఈనెల 5న సందర్శించనున్నారు. అనంతరం కుటుంబ వైద్య ఆరోగ్య కమిషనర్ కార్యాలయంలో నివేదిక అందించనున్నారు. క్వాలిటీ సెల్ పాయింట్ల ఆధారంగానే కాయకల్ప అవార్డుకు ఎంపిక కానుంది.

ప్రతి గది పరిశీలన

ఆసుపత్రిలో ఉన్న డెలివరీ గది, జనరల్, ఇతర వార్డులను సందర్శించనున్నారు. వార్డుల్లో ఉండే బెడ్‌షీట్లు మొదలు సామగ్రి, స్టెరిలైజేషన్, శానిటేషన్‌ను పరిశీలించనున్నారు. ఫార్మసీ, ల్యాబ్, ఎక్స్‌రే, మూత్రశాల, మరుగుదొడ్ల శుభ్రతను పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. మొత్తంగా 350 పాయింట్లు ఉండగా అందులో వారు కేటాయించిన మార్కుల బట్టి అవార్డు దక్కే అవకాశాలు ఉన్నాయి.

సిద్ధంగా ఉన్నాం.



ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. డెలివరీలు గణనీయంగా పెరిగాయి. జనరల్ వ్యాధులకు ఇక్కడే వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రతి వస్తువును రోజు స్టెరిలైజేషన్ చేస్తున్నాం. ఆస్పత్రితో పాటు చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచాం. గతంలో కంటే మెరుగైన అవార్డు వస్తుందని ఆశిస్తున్నాం. సిబ్బంది, ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకెళ్తాం. – డాక్టర్ రమాదేవి డీడీఓ, సుల్తానాబాద్

శబరిమల వెళ్తూ.. అనంతలోకాలకు

- గుండెపోటుతో అయ్యప్ప దీక్షాపరుడి మృతి
- రామగుండం రైల్వేస్టేషన్‌లో ఘటన



అంజయ్య యాదవ్ మృతదేహం

రామగుండం/సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని శాస్త్రినగర్‌కు చెందిన అయ్యప్ప దీక్షాపరుడు, శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ ఐంద అంజయ్య యాదవ్ (41) గుండెపోటుతో మృతిచెందారు. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య యాదవ్ శబరిమల వెళ్లేందుకు తన తోటి స్వాములతో కలిసి సోమవారం రాత్రి రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. కేరళ ఎక్స్‌ప్రెస్ రైలు ఆలస్యంగా నడుస్తుండటంతో టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద అయ్యప్ప స్వాములతో కలిసి, గద్దెపై నిద్రించాడు. మంగళవారం వేకువజామున రైలు వచ్చే సమయానికి ఆయన లేకపోవడంతో దీక్షాపరులు 108కు సమాచారం అందించారు. రామగుండం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య స్వరూప, ఇద్దరు కుమారులున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి పేర్కొన్నారు. అంజయ్య యాదవ్ మృతి విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆయన ఇంటికి వెళ్లారు. మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు.

సికాస సెంట్రల్ మాజీ ఆర్గనైజర్ మృతి



రాజారాం (ఫైల్)

రామగుండం: అబాది రామగుండంకు చెందిన, సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) సెంట్రల్ మాజీ ఆర్గనైజర్ దయా రాజారాం(56) అనారోగ్య కారణాలతో మంగళవారం మృతిచెందారు. అంతర్గాం జెడ్పీటీసీ సభ్యుడు ఆముల నారాయణ ఆయన మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. 1988–98 మధ్య కాలంలో రామగుండం, గోదావరిఖని, మందమర్రి, బెల్లంపల్లి తదితర సింగరేణి బొగ్గు గనుల్లో కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమించిన నేత రాజారాం అని కొనియాడారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వీరిది నిరుపేద కుటుంబం కాగా అద్దె ఇంట్లో ఉంటున్నారు.

రామగుండంలో కార్పొరేటర్ భర్త..



కనకయ్య నేత్రాలను ఐ బ్యాంకుకు అందిస్తున్న కుటుంబసభ్యులు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, అప్పటి నుంచి చికిత్స పొందుతున్న జంగపల్లి అలియాస్ గడ్డి కనకయ్య(63) మృతిచెందారు. వివరాల్లోకి వెళితే.. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో సీనియర్ సివిల్ కాంట్రాక్టర్, 38వ కార్పొరేటర్ సరోజన భర్త కనకయ్య తన కుటుంబసభ్యులతో కలిసి గౌతమినగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆయనకు కుమారుడు అవినాష్, కూతుళ్లు గౌతమి, అంజలి, పావని ఉన్నారు. గతేడాది సెప్టెంబర్ 14న మున్సిపల్ కార్యాలయం ఎదుట కనకయ్య తన బైక్‌పై వెళ్తుండగా వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన తలకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా అప్పటినుంచి చికిత్స పొందుతున్నారు. ఆపరేషన్ చేసినప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించి, మంగళవారం మృతిచెందారు. అంతటి బాధలోనూ ఆయన నేత్రాలను దానం చేయడానికి కుటుంబసభ్యులు ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి కేఎస్ వాసు, లయన్స్ క్లబ్ ప్రతినిధి బెనీగోల్ త్రివేది ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ కనకయ్య నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. కనకయ్య మృతదేహానికి నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లు నివాళులర్పించారు.

ప్రజారోగ్యాలతో చెలగాటమాడుతున్న ఓసీపీని మూసేయాలి



మాట్లాడుతున్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: ప్రజారోగ్యాలతో చెలగాటమాడుతున్న జీడీకే–5 ఓసీపీకి వ్యతిరేకంగా రాష్ట్రస్థాయిలో పోరాటం నిర్వహిస్తామని, అవసరమైతే ట్రిబ్యునల్‌ను ఆశ్రయిస్తామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓసీపీ–5కి వ్యతిరేకంగా జరిగిన ధర్నాలో మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం, స్థానిక ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీడీకే–5 ఓసీపీని కాంగ్రెస్ మొదటి నుంచీ వ్యతిరేకిస్తోందన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటాలు చేశామన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఓసీపీని వ్యతిరేకించామన్నారు. సింగరేణి యాజమాన్యం ఓసీపీ–5 ప్రాజెక్టుతో ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకుని మూసివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మరిన్ని ప్రత్యక్ష పోరాటాలు చేస్తామన్నారు. ఓసీపీ వైపు ర్యాలీగా వెళ్తుండగా పోలీసులు అరెస్టుచేసి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. నాయకులు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, పెద్దెల్లి తేజస్విని, ఎండీ.ముస్తాఫా, గాదం విజయనంద్, నాయకులు గట్ల రమేశ్, గుండేటి రాజేశ్, యుగంధర్, నజీముద్దీన్, ఆసిఫ్‌పాషా, దుక్కల శ్రీనివాస్, పాతిపల్లి రవి, దూళికట్ట సతీష్, దాసరి విజయ్, పీక అరుణ్‌కుమార్, ఉదయ్ పాల్గొన్నారు.

బేస్‌వర్క్‌షాప్ తరలింపు పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న జీఎం

గోదావరిఖని: బేస్‌వర్క్‌షాప్ తరలింపు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ సూచించారు. మంగళవారం బేస్‌వర్క్‌షాప్‌ను సందర్శించారు. ఓబీ డంప్‌యార్డు కోసం పాత బేస్‌వర్క్‌షాప్‌ను కృషిభవన్ వద్దకు తరలిస్తున్నామని, పదిరోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీఎం వెంట ప్రాజెక్ట్ అధికారి జి.మోహన్‌రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజినీర్ దుర్గాప్రసాద్, బేస్ వర్క్‌షాప్ ఇన్‌చార్జి రామకృష్ణ, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ.రమణ ఇతర అధికారులు ఉన్నారు.

పుట్టినరోజునే.. పురుగుల మందు తాగి

- కొలనూర్‌లో యువకుడి ఆత్మహత్య



మహేశ్‌రెడ్డి మృతదేహం

ఓదెల(పెద్దపల్లి): ఇంట్లో కుటుంబసభ్యులు, స్నేహితుల మధ్య సంతోషంగా పుట్టినరోజు జరుపుకున్నాడు.. రాత్రి పురుగుల మందు తాగి తనవు చాలించాడు ఓదెల మండలంలోని కొలనూర్‌కు చెందిన గిట్ల మహేశ్‌రెడ్డి(28). పొత్కపల్లి ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్‌రెడ్డి చిన్నప్పటి నుంచి ఫిట్స్‌తో బాధ పడుతున్నాడు. వ్యవసాయ పనులు చురుగ్గా చేసేవాడు. ఫిట్స్ తగ్గేందుకు పలు ఆసుపత్రులకు వెళ్లి, మందులు వాడాడు. అయినా నయం కాకపోవడంతో మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో సోమవారం పుట్టినరోజు సందర్భంగా రోజంతా సంతోషంగా గడిపాడు. రాత్రి పురుగుల మందు తాగి, ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రాఘవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గూడెం కౌలురైతు..



సంపత్ మృతదేహం

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని గూడెం గ్రామానికి చెందిన వీరముష్టి సంపత్(40) అనే కౌలురైతు, ఒగ్గుకథ కళాకారుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. సంపత్ ఇందుర్తిలో ఓ రైతుకు చెందిన నాలుగెకరాల భూమిని కౌలుకు తీసుకొని, మొక్కజొన్న పంట వేశాడు. ప్రస్తుతం ఎస్సారెస్పీ కాలువలో నీరు వస్తుండటంతో పంటకు పారించేందుకు కాలువ వద్ద మోటార్‌ను అమర్చాడు. ఈ క్రమంలో మంగళవారం దాన్ని ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతం సంభవించింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై మహేందర్ పేర్కొన్నారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే క్వార్టర్లలో నివాసముంటున్న ఆ శాఖ ఉద్యోగి తాండ్ర శ్రీనివాస్(38) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సహదేవ్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా కాజీపేట సమీపంలోని బాపూజీనగర్‌కు చెందిన శ్రీనివాస్ పెద్దపల్లి రైల్వేస్టేషన్‌లో పని చేస్తున్నాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. ఆయన ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదని, విచారణ జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య రజిత, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

నేడు నర్సింగ్ స్క్రీనింగ్ టెస్ట్

పెద్దపల్లిరూరల్: బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం డిప్లొమా కోర్సు చదివి.. జపాన్ దేశంలో నర్సింగ్ ఉద్యోగం చేసేందుకు ఆసక్తి గల వారు ఈనెల 4న వరంగల్‌లో నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షకు హాజరుకావాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి తిరుపతిరావు తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా శిక్షణతోపాటు నియామకానికి బుధవారం వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌లో స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని వివరించారు. 22 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని, వివరాలకు 91007 98204, 99088 30438నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అల్ఫోర్స్‌లో ముందస్తు సంక్రాంతి



సుల్తానాబాద్(పెద్దపల్లి): విద్యార్థులకు పండుగుల విలువ, సంప్రదాయాలు తెలియాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ పాఠశాల ఆవరణలో ముందస్తు మకర సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పిండి వంటలు, భోగి మంటలు, కోడిపుంజుల కొట్లాట, నారు వేయడం, గంగిరెద్దుల ఆట తదితర కార్యక్రమాలు పల్లె సంస్కృతి ఉట్టిపడేలా జరిపారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పండుగల ద్వారా ప్రేమ, ఆప్యాయతలు వెల్లివిరుస్తాయని, తద్వారా సమాజంలో అభివృద్ధి చోటుచేసుకుంటుందని తెలిపారు. సంక్రాంతి పండుగ రైతుల శ్రేయస్సును సూచిస్తుందన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల సంక్రాంతి నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యాంసుందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

